ఈనాడు
epaper.eenadu.net

# అభివృద్ధే ఎజెండా

## ఎన్నికల సమయంలోనే రాజకీయాలు

- ఓల్డ్‌సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ!
- చంచల్‌గూడ జైలు స్థానంలో పేదలకు విద్యాసంస్థ
- ఎంజీబీఎస్–ఫలక్‌నుమా మెట్రో శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్

ఈనాడు - హైదరాబాద్; న్యూస్‌టుడే- చార్మినార్, చాంద్రాయణ గుట్ట, గోల్కొండ: 'కులీ కుతుబ్‌షాహీ నుంచి నిజాం వరకు హైదరాబాద్ అభివృద్ధికి కృషి చేశారు. అంతర్జాతీయ ఖ్యాతి పొందేలా తీర్చిదిద్దారు. ఇప్పుడు నగర ప్రతిష్ఠను నిలబెట్టడానికి మేం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకెళ్తున్నాం. అని సీఎం అన్నారు. మెట్రో ఫేజ్-2 విస్తరణ పనుల్లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కిలోమీటర్ల మెట్రోలైన్ విస్తరణ పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

...మిగతా 2లో



ఫారూఖ్‌నగర్ వద్ద మెట్రోరైలు పనులకు శిలాఫలకం ఆవిష్కరించిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డితో అసదుద్దీన్ ఆత్మీయ కరచాలనం.. చిత్రంలో షబ్బీర్‌అలీ

## ఐదేళ్లూ రేవంత్ అధికారంలో ఉంటారు

- ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆసక్తికర వ్యాఖ్యలు

ఈనాడు, హైదరాబాద్: మెట్రో ఫేజ్-2 విస్తరణ పనుల్లో భాగంగా సీఎం రేవంత్‌తో పాటు సభలో పాల్గొన్న ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యలు ఆసక్తి రేకెత్తించాయి. తొలుత ఆయన మాట్లాడుతూ 'హైదరాబాద్‌కు గుండెలాంటి

...మిగతా 2లో

Date : 09/03/2024 EditionName : GREATER HYDERABAD PageNo :

ఈనాడు
epaper.eenadu.net

# అభివృద్ధే ఎజెండా

(మొదటి పేజీ తరువాయి)

'ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు.. మిగతా సమయంలో అభివృద్ధిపైనే మా దృష్టి. ఇది ఓల్డ్ సిటీ కాదు... ఒరిజినల్ హైదరాబాద్ సిటీ. పాతబస్తీలోని గల్లీగల్లీలో ఏముందో.. ఏం జరుగుతుందో నాకు తెలుసు చార్మినార్, బహదూర్‌పుర, మదీనా ప్రాంతాలతో ఎంతో అనుబంధం ఉంది. కల్వకుర్తికి వెళ్లాలంటే ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తుంటా. సంతోష్‌నగర్ నుంచి ఒవైసీ ఆసుపత్రి మీదుగానే నేను వెళ్లాలి. ఇక్కడ మదీనాలో బిర్యానీ, చాయ్ అన్నీ నాకు తెలుసు. ఈ ఒరిజినల్ నగరాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా' అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 2004 నుంచి 2014 వరకు దశాబ్దకాలం హైదరాబాద్ అభివృద్ధి కోసం కాంగ్రెస్ కృషి చేసిందన్నారు. ప్రజల తాగునీటి అవసరాలను గుర్తించి కృష్ణా, గోదావరి నదుల నుంచి నీటిని తీసుకొచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. అవుటర్ రింగ్‌రోడ్డు నుంచి ఐటీ, ఫార్మా రంగాల వృద్ధి కాంగ్రెస్ హయాంలో జరిగిందన్నారు.

"మహానగరం 25 ఏళ్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని బృహత్తర ప్రణాళిక తీసుకురాబోతున్నాం. కంటోన్మెంట్‌లో రోడ్ల విస్తరణ, ఉత్తర తెలంగాణ వైపు ప్రయాణాలు సాఫీగా సాగేందుకు ఎలివేటెడ్ కారిడార్, హైదరాబాద్‌లో మెట్రో లైన్ల విస్తరణ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నాం. వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మెట్రో పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటినుంచి గౌలిగూడ- ఫలక్‌నుమా మెట్రో పనులు పెండింగ్‌లో ఉన్నాయి.. వాటిని పూర్తి చేసే బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంది. చాంద్రాయణగుట్ట క్రాస్‌రోడ్‌లో మెట్రో అతిపెద్ద జంక్షన్ రాబోతోంది. గత ప్రభుత్వం ధనవంతులను దృష్టిలో పెట్టుకొని హైటెక్ సిటీ నుంచి విమానాశ్రయం వరకు చేసిన మెట్రో ప్రతిపాదనలకు బదులు... పేదలు, మధ్యతరగతి వారిని దృష్టిలో పెట్టుకొని మార్గాలను మార్చాం. నాగోల్-ఎల్బీనగర్, ఎల్బీనగర్-హయత్‌నగర్, ఎల్బీనగర్- చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి, అటు నుంచి విమానాశ్రయానికి, చాంద్రాయణగుట్ట నుంచి రాజేంద్రనగర్‌లో 100 ఎకరాల్లో నిర్మించే హైకోర్టు వరకు, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు, మియాపూర్, బీహెచ్ఈఎల్, రామచంద్రాపురం వరకు కొత్త మెట్రోలైన్ నిర్మించనున్నాం. హైదరాబాద్ అభివృద్ధి కోసం 2050 మాస్టర్‌ప్లాన్ తయారు చేయబోతున్నాం. 55 కిలోమీటర్ల మేర మూసీనది అభివృద్ధికి ప్రత్యేక మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేస్తున్నాం.

## 2034 వరకు కాంగ్రెస్‌దే అధికారం

ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు, మిగిలిన సమయంలో అభివృద్ధి పనులపై దృష్టి పెడతాం. ఎన్నికల్లో శక్తికి మించి పోరాడతాం. ముస్లిం సమస్యలపై పార్లమెంట్‌లో పోరాడే ఒకేఒక్క నాయకుడు ఎంపీ అసదుద్దీన్. అభివృద్ధి పనుల్లో అందర్నీ కలుపుకొని పోతాం. ప్రజాసమస్యలపై కొట్లాడతాం తప్ప.. ఎవరితోనూ మాకు వ్యక్తిగత కక్షలు లేవు. నగరం అభివృద్ధి చెందాలంటే నాయకుల సహకారం కావాలనే ఉద్దేశంతో లండన్ పర్యటనలో అక్బరుద్దీన్ ఒవైసీతో కలిసి థేమ్స్ నది పరిశీలించాం. గుజరాత్‌లోని సబర్మతి నది మాదిరి మూసీ అభివృద్ధి కోసం సహకరించాలని ప్రధాని మోదీని కోరాం. మీరాలం వంతెన పనులు ప్రారంభించాలని అసదుద్దీన్ కోరడంతో ఎన్నికల కోడ్ ఉన్నా ఈసీ అనుమతి తీసుకొని వంతెన పనులకు రూ.363 కోట్లు మంజూరు చేశాం. చంచల్‌గూడ జైలును ఇక్కడి నుంచి తరలించి పేదలకు కేజీ నుంచి పీజీ విద్య అందేలా చూడాలని అసదుద్దీన్ కోరారు. ఆయన సూచనను అమలుచేస్తాం. పాత నగరం, ఇక్కడి ప్రజల అభివృద్ధికి కట్టుబడి ఉన్నా. 2034 వరకు కాంగ్రెస్ అధికారంలో ఉంటుంది" అని రేవంత్ అన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోల్కొండలో మైనార్టీ గురుకులం ప్రారంభం

గోల్కొండ ఇబ్రహీంబాగ్‌లో రూ.20 కోట్లతో నిర్మించిన తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ (గోల్కొండ బాయ్స్-1) పాఠశాలను శుక్రవారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓ విద్యార్థి ముఖ్యమంత్రి చిత్రపటాన్ని ఆయనకు బహూకరించారు. 2020లో హైదరాబాద్ ఎంపీ నిధులతో పాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం షేక్‌పేట సత్యాకాలనీలో అద్దెభవనంలో నడుస్తున్న ఈ పాఠశాలను ఇబ్రహీంబాగ్‌కు మార్చనున్నారు.





ఫారూఖ్‌నగర్ వద్ద మెట్రోరైలు పనులకు శిలాఫలకం ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో నేతలు వేంనరేందర్, అనిల్‌కుమార్ యాదవ్, వేణుగోపాల్, మోతె శోభన్‌రెడ్డి, జాఫర్‌హుస్సేన్ మేరాజ్, మహేందర్‌రెడ్డి, అసదుద్దీన్ ఒవైసీ, షబ్బీర్‌అలీ, అహ్మద్ బలాల, శ్రీలతారెడ్డి, మొబిన్, రహమత్‌బేగ్

# రేవంత్ ఐదేళ్లూ అధికారంలో ఉంటారు

(మొదటి పేజీ తరువాయి)

పాతబస్తీకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం. తెలంగాణ ప్రజలు మిమ్మల్ని గెలిపించారు. మేము స్వాగతిస్తున్నాం. మీరు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తారని ఆశిస్తున్నాం. మీ చేతుల్లో ఐదేళ్ల అధికారం ఉంటుంది. మీరు చేసే అభివృద్ధికి మేం పూర్తిగా సహకరిస్తాం' అని పేర్కొన్నారు. రేవంత్ సర్కారు త్వరలో కూలిపోతుందని భారాస-భాజపా నేతలు ఇటీవల పదేపదే అనడం.. కాంగ్రెస్ అయిదేళ్ల అధికారం ఉంటుందని తాజాగా అసద్ స్వయంగా సీఎం సమక్షంలో పేర్కొనడం గమనార్హం. అంతేకాక రేవంత్ మొండిఘటమని.. పోరాడి అధికారం సాధించుకున్నారని ప్రశంసించారు.

## అభివృద్ధిలో భాగస్వాములవుతాం

ఇంకా అసదుద్దీన్ మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధిలో ఎంఐఎం భాగస్వామి అవుతుందన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా కొందరు ప్రయత్నిస్తున్నారని, దీన్ని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక యాకుత్‌పురాలో 3 రోడ్ల విస్తరణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పగానే రూ.200 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. మీరాలం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసేందుకు సానుకూలత వ్యక్తం చేశారన్నారు. ఉస్మానియా ఆసుపత్రికి నూతన భవనం నిర్మించాలని, చంచల్‌గూడ జైలును నగరం బయటకు తరలించాలని, ఆ స్థలంలో కేజీ నుంచి పీజీ క్యాంపస్ నిర్మించాలని కోరుతున్నామన్నారు. డీఎస్సీలో ఉర్దూ మీడియం అభ్యర్థులకు తగిన ప్రాధాన్యం కల్పించాలన్నారు. మూసీ నది అభివృద్ధిలోనూ తమ వంతు సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. నాగోల్ నుంచి విమానాశ్రయం వరదకు మెట్రో పనులు త్వరితగతిన పూర్తయితే ఎంతోమందికి ఉపయోగపడుతుందని అసద్ పేర్కొన్నారు.

Date : 09/03/2024 EditionName : GREATER HYDERABAD PageNo :